## కథ

# లక్ష్యం

**ఆఫీసు అవర్సు అయిపోయినట్టు గడియారం ఐదు గంటలు సూచిస్తోంది. తన వర్కంతా పూర్తిచేసుకొని ఇంటికి బయలుదేరడానికి లేచింది చందన.**

"మిమ్మల్ని ఆఫీసరుగారు పిలుస్తున్నారు" చెప్పాడు అటెండరు.

ఇప్పుడేమీ పని ఇవ్వడు కదా అని భయపడుతూనే ఆఫీసరు రూంలోకి వెళ్లింది చందన.

"ఇఫ్ యూ డోంట్ మైండ్ ఈ ఫైల్స్ ఒకసారి చూస్తారా" అభ్యర్థనగా అన్నాడు ఆఫీసర్.

తను భయపడిందంతా అయిందన్నమాట, ఆఫీసులో ఎవరు సెలవు పెట్టినా తనకి ఎక్స్‌ట్రా వర్క్ తప్పదు అనుకుంది చందన.

"సారీ మేడమ్ మీకు ట్రబులిస్తున్నట్టున్నాను" నొచ్చుకుంటూ అన్నాడు ఆఫీసర్.

"ఫర్వాలేదు సర్" ఆఫీసర్ మీదున్న గౌరవంతోనే, నో అని చెప్పలేని మొహమాటంతోనో అన్నది చందన.

ఆ పనంతా పూర్తయి బయటపడేసరికి ఆరుదాటింది. ఈ రోజు డైరెక్టు బస్సులో వెళ్లే ఆశ లేదు. రెండు బస్సులు మారి వెళ్లాల్సిందే అనుకున్న చందనకి ఒళ్లు ఝల్లుమంది. ఇవాళ ఇల్లు చేరేసరికి ఎంతలేదన్నా ఏడు దాటుతుంది. ఆమె భయమంతా ఇంటికి ఎలా చేరాలా అని కాదు. ఆలస్యంగా ఇల్లు చేరినందుకు సవాలక్ష ప్రశ్నలు వేసి వేధించే భర్తకి ఎలా సంజాయిషీ చెప్పుకోవాలా అని. భర్త చేసే రాద్ధాంతం తల్చుకొని భయపడుతూనే గేటు తెరుచుకొని రాబోయిన చందనకి గుమ్మంలోనే కనిపించాడు భర్త రాజేష్.

"ఏమిటింత లేటు ఇవాళ మీ బాస్ నిన్ను త్వరగా వదిలిపెట్టలేదా" చందన వంక అదోలా చూస్తూ అన్నాడు రాజేష్.భర్త మాటల్లోని శ్లేష అర్థమైనా అతడికి ఎదురుచెప్పకుండా గబగబా కాళ్లు కడుక్కొని వచ్చి కాఫీ కలిపే ప్రయత్నంలో పడింది చందన. ఆమె మౌనాన్ని అతడు నిర్లక్ష్యంగా అర్థం చేసుకున్నాడు.

"మొగుడనే వాడు ఇంట్లో ఏడ్చాడనే స్పృహ ఉందా నీకు" ఆమె వెనకాలే వంటింట్లోకొచ్చి రెట్టించాడు.

ఆఫీసులో వర్కు. రెండు బస్సులు మారి ఇల్లు చేరిన అలసటా.. అతడి సాధింపులూ ఆమె సహనానికి పరీక్షలా నిలిచాయి. తనొక కాఫీకప్పు తీసుకొని భర్తకింకొక కప్పు అందించబోయింది చందన.

"ఎక్కడ ఎవడితో తిరిగొచ్చావ్" కాఫీ కప్పు అందుకోకుండానే అన్నాడు రాజేష్.

"అర్జెంటు పనొస్తే అది చేసి వచ్చేసరికి డైరెక్టు బస్సు వెళ్లిపోయింది. రెండు బస్సులు మారి వచ్చేసరికి లేటయ్యింది" కళ్లనీరు తిరుగుతుండగా సంజాయిషీగా అన్నది చందన.

"ఆఫీసులో అర్జెంటు పనులు చేసేది నువ్వొక్కత్తివేనా. మా ఫ్రెండు మోహన్ భార్య పనిచేసేది కూడా నీ ఆఫీసులోనే కానీ ఏ రోజూ లేటుగా ఇంటికి రాదు. వాడే చెప్పాడు ఆ మాట."

చందనకి మోహన్ భార్య నీలిమ గుర్తొచ్చింది. ఆమె కూడా తను పనిచేసే సెక్షన్‌లోనే చేస్తుంది. పరమ బద్ధకస్తురాలు. ఏ రోజూ పని పూర్తిచేయదు. మర్నాటికి పెండింగ్ పెడుతుంది. ఆఫీసరు మంచివాడు కాబట్టి గట్టిగా వార్నింగ్ ఇవ్వకుండా చూసీ చూడనట్టు వదిలేస్తాడు. ఆమె అంటే ఆఫీసులో ఎవరికీ సదభిప్రాయం లేదు. తనకి అలా ఉండడం చిరాకు. తన పని ఎప్పుడూ పెండింగ్‌లో ఉండదు.

"ఏమిటి నీలిమ గురించి ఆలోచిస్తున్నావా? నీ అంత అందంగా ఉండదులే అదందుకేనేమో మీ బాస్ ఎక్స్‌ట్రా వర్కు ఎప్పుడూ నీకే ఇస్తాడు"

నీలిమ ఆలోచనలని చెదరగొడుతూ అన్నాడు రాజేష్.భార్య కాస్త అందంగా ఉంటే చాలు అనుమానంతో వేధిస్తారు ఛీ.. ఛీ.. అసలు అనుమానం ముందు పుట్టి తరువాత మగవాడు పుట్టాడేమో. భర్త ప్రవర్తనని మనసులోనే అసహ్యించుకుంది చందన. ఎన్నోసార్లు భర్త పట్ల తన అసహ్యాన్ని వెళ్లగక్కాలనుకుంటుంది చందన.

చందనకి తల్లి చెప్పిన సూక్తిముక్తావళి గుర్తుకొచ్చింది "చూడు చందూ చదూకున్నాను. ఉద్యోగం చేస్తున్నాను అని నీకు కొంత అహం ఉండచ్చు. ఆ అహం వల్ల నీకు ఆత్మసంతృప్తి లభిస్తుందేమో గానీ నీ కాపురం సజావుగా సాగడానికి అది అవరోధం అవకుండా చూసుకో. మగవాడికి అహం పుట్టుకతో వస్తుంది. ఆ అహాన్ని చాటుకోడానికి అతడు నిన్ను మాటలతో నొప్పించవచ్చు. అది అతడి సహజ స్వభావమనుకొని, ఓర్పు వహించు. అపుడే నీ కాపురం హాయిగా సాగిపోతుంది"

హు ఓర్పు - ఎంతకాలం?

నిట్టూర్చింది చందన.

* * *

ఆ రోజు ఉదయం వంటింట్లో ఏదో పని చేసుకుంటోంది చందన. న్యూస్‌పేపర్ పట్టుకొని వంటింట్లోకొచ్చాడు రాజేష్.

"ఈరోజు పేపరు చూశావా ఎవడితోనో అక్రమ సంబంధం పెట్టుకున్న ఓ ఇల్లాలు తన ప్రియుడితో కలిసి భర్తనే హత్య చేసిందట" అన్నాడు.రాజేష్‌కి ఇలాటి వార్తలు చదవడం, చదివిన తరువాత ఆ వార్తని తనదైన శైలిలో విశ్లేషించి తీర్పు చెప్పడం అలవాటు. ఆ తీర్పులో ఎప్పుడూ ఆడవాళ్లనే తప్పుపడతాడు.

"ఆడదాని బుద్ధి చంచలం. అందుకే ఆడది చిన్నప్పుడు తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో బిడ్డల అదుపులో ఉండాలి. పాపం పూర్ ఫెలో. భార్యని అదుపులో పెట్టడం చేతకాక ఆ పెళ్లాం చేతిలోనే చచ్చాడు" న్యూస్‌పేపరు వార్తని తన బుద్ధి అనుసారం విశ్లేషించాడు రాజేష్.

ఇందులో తప్పు ఒక్క ఆడదానిదేనా? ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకొని ఆమె భర్తని హత్య చేసిన మగవాడికీ పాపంలో భాగం లేదా? అయినా ఇలాటి కేసులు తక్కువ. అనుమానంతో భార్యని వేధించి హత్య చేసే కేసులే ఎక్కువ అని భర్తతో గట్టిగా వాదించాలనిపించింది చందనకి. కానీ తన పండంటి కాపురాన్ని (?) కూలదోసే వాదనలు చేయకూడదని భర్తకి కోపం తెప్పించకూడదని తల్లి చెప్పిన సూత్రం గుర్తొచ్చి ఊరుకుంది. అయినా భర్త స్వభావం తెలిసీ అతనితో వాదించడం మూర్ఖత్వంగా తోచింది చందనకి. అతడి దృష్టిలో భార్య అంటే 'కీ' తిప్పి ఆడించే కీలుబొమ్మ. ఆ 'కీ' ఎప్పుడు తన చేతిలోనే ఉండాలనుకొంటాడతడు.

* * *

ఆ రోజు ఆదివారం.

పొద్దున్నే టిఫిన్ తిని కాఫీ తాగాక హెయిర్ కటింగ్ చేయించుకోడానికి వెళ్లాడు రాజేష్. అతడు బైటికెళ్లాక ఇల్లు సర్దడంలో పడిపోయింది చందన. మిగతా రోజుల్లో తనకు తీరిక ఉండదు కనుక ఆదివారం బూజులు దులపడం, ఇల్లు సర్దడం లాటి పని పెట్టుకుంటుంది చందన. ఇల్లంతా నీట్‌గా సర్ది ఫ్లోరింగ్ అంతా సర్ఫ్‌నీళ్లతో తుడిచి ఇంటినొకసారి తృప్తిగా చూసుకొని స్నానం చేయడానికి వెళ్లబోతుంటే కాలింగ్ బెల్ మోగింది. రాజేష్ అప్పుడే వచ్చేశాడా అనుకుంటూ హడావిడిగా వెళ్లి తలుపు తీసింది. ఎదురుగా రాజేష్ ఫ్రెండు మోహన్ నవ్వుతూ నిలబడ్డాడు.

"మీరా?" తడబడుతూ అన్నది చందన.

"రాజేష్ లేడా?" అన్నాడు మోహన్.

రాజేష్ ఏ పని మీద వెళ్లాడో చెప్పింది చందన. "నేను వెయిట్ చేస్తాలెండి వాడొచ్చేదాకా" అన్నాడు మోహన్.

ఇక అతడిని కూర్చోమనక తప్పలేదు చందనకి. న్యూస్‌పేపర్ ఇచ్చి చదువుతూ కూర్చోమని చెప్పి తను లోపలికెళ్లింది. పావుగంట గడిచింది. రాజేష్ ఇంకా రాలేదు. బాగుండదని కాఫీ కలిపి ఇచ్చింది.

"ఇప్పుడెందుకండీ" మొహమాట పడుతూనే కాఫీ కప్పు అందుకున్నాడు మోహన్.

"మీ ఇల్లు చాలా పొందిగ్గా ఉందండి. ఉద్యోగం చేస్తూ ఇల్లు కూడా ఎంతో నీట్‌గా సర్దుకున్నారు. మా నీలిమకి బద్ధకం ఎక్కువ. ఎక్కడివక్కడే పడేస్తుంది" చంద

**ఆదుర్తి బాల**

నని మెచ్చుకుంటూ అన్నాడు మోహన్. నీలిమకి ఈ పరిస్థితి ఇబ్బందిగా ఉంది. తను ఇలా మోహన్‌తో మాట్లాడడం చూస్తే రాజేష్ ఏమంటాడోనన్న భయం ఒక పక్క - పోనీ లోపలికి వెళ్లిపోతే అతను మాట్లాడుతున్నా తను మాట్లాడకుండా వెళ్లిపోతే మోహన్ ఏమనుకుంటాడోనన్న సంశయం ఓ పక్క చందనని నిలకడగా ఉండనీయటం లేదు. అన్యమనస్కంగానే మాట్లాడుతూ కూర్చుంది చందన. అప్పుడొచ్చాడు రాజేష్.

"హాయ్ మోహన్ ఎంతసేపయింది వచ్చి" మిత్రుడిని పలకరించాడు.రాజేష్ రావడంతోటే లోపలికి వెళ్లిపోయింది చందన.


"అరగంట దాటింది బాబూ - ఏమిటీ హెయిర్ కటింగ్‌కి ఇంతసేపా?"

"లేదులే దారిలో ఓల్డ్ ఫ్రెండ్ ఒకడు కనిపిస్తే మాట్లాడుకున్నాము. ఎనీ హౌ సారీ బ్రదర్ బాగా బోర్‌కొట్టిందనుకుంటాను"

"నో... నో.. బోర్ ఏం కొట్టలేదు చందనగారు కాఫీ ఇస్తే తాగుతూ కబుర్లు చెప్తూ కూర్చున్నాను. టైమే తెలీలేదనుకో" మోహన్ అంటున్న మాటలు లోపల ఉన్న చందనకి వినిపిస్తూనే ఉన్నాయి. అగ్నికి ఆజ్యం పోశాడు. అది భగ్గుమనక మానదు. అది మరోసారి తన హృదయాన్ని కాల్చకమానదని నిర్లిప్తంగా అనుకుంది చందన.

"నీ కంపెనీ బాగుందట. తెగ మెచ్చుకున్నాడు మా వాడు. నువ్వందంగా ఉంటావుగా నీ కంపెనీ ఎవరికైనా బాగుంటుంది" మోహన్ వెళ్లిపోయాక లోపలికొస్తూ అన్నాడు రాజేష్

'ఛీ.. ఇలా తప్పితే మామూలుగా మాట్లాడలేడా' అసహ్యించుకుంది చందన.




"ఏం మాట్లాడావు వాడితో. అయినా నేనింట్లో లేనని చెప్పి పంపించక వాడిని లోపలికి పిలిచి కూర్చోబెడతావా? కాఫీ ఇచ్చి కబుర్లు చెప్తావా? పరువుగల ఆడది చేసే పనేనా ఇది"

"ఇందులో పరువుపోయే పని ఏం చేశాను? నేను మీ ఫ్రెండుని లోపలికి రమ్మనలేదు. అతడే వచ్చి కూర్చున్నాడు. మర్యాద కోసమని కాఫీ ఇచ్చాను. అతడేదో పలకరిస్తే మాట్లాడాను. అది తప్పా" వస్తున్న కోపాన్ని అణచుకుంటూ అన్నది చందన.

"జరిగింది అదే అయితే నాకేం అభ్యంతరం లేదు" అదోలా అన్నాడు రాజేష్.

"అంటే మీ ఉద్దేశ్యం?"

"నీతో మాట్లాడుతుంటే వాడికి టైమే తెలీలేదుట. అంతగా ఎంటర్‌టైన్ చేశావా వాడిని. నీలాటి భార్య దొరకడం నా అదృష్టంట. నాతో మాట్లాడిన అరగంటలో పావుగంట నీ గురించే చెప్పాడు. సరే ఎన్నాళ్లు సాగుతుందో ఈ భాగోతం నేనూ చూస్తాను" విసురుగా అనేసి వెళ్లిపోయాడు రాజేష్.

స్థాణువులా నిలబడిపోయింది చందన.

★ ★ ★

"హాయ్ చందూ" బస్టాపులో నిలబడిన చందన తననెవరో పిలిచినట్టు అనిపించి పక్కకి తిరిగి చూసింది. డిగ్రీలో తన క్లాస్‌మేట్ మంజూష నవ్వుతూ కనిపించింది.

"ఏంటే అలా చూస్తున్నావ్ గుర్తుపట్టలేదా నన్ను. కాలేజీ రోజుల్లో జాజిమొగ్గలా ఉండేదాన్ని. ఇప్పుడు గుమ్మడికాయలా అయ్యాను కదూ. అందుకే గుర్తు పట్టలేదేమో" పెద్దగా నవ్వుతూ అన్నది మంజూష

మనిషి స్వరూపం మారినా స్వభావం ఏమీ మారలేదు అనుకుంది చందన.

"ఏమిటే చందూ అలా బక్కచిక్కి ములక్కాడలా తయారయ్యావ్" అది బస్టాపు అనీ అందరూ తమనే చూస్తున్నారనీ కూడా పట్టించుకోకుండా అన్నది మంజూష

పేలవంగా నవ్వింది చందన.

"ఈయనే మా ఆయన" తన పక్కన నిలబడ్డ వ్యక్తిని చూపిస్తూ అన్నది మంజూష

"నమస్తే" చేతులు జోడించింది చందన.

"నేనెప్పుడూ చెబుతుంటా చూడండి చందన అని, ఈమె గురించే"

మంజూష తన పేరు చెప్పి పరిచయం చేయగానే అతడి కళ్లలో ఆసక్తి కనిపించింది చందనకి.

"మీరు చాలా బాగా పాడతారుట కదా. చదువులో కూడా ఎప్పుడూ ఫస్టు ఉంటారుట కదా. మా మంజూ మీ గురించి ఎప్పుడూ చెబుతూ ఉంటుంది. ఇన్ని ప్రత్యేకతలు ఒకే మనిషిలో ఉండడం రియల్లీ గ్రేట్" అతని మాటలు చందనకి కొత్తగా అనిపించాయి.

"అవునే చందూ ఇంకా పాటలు పాడుతున్నావా? నువ్వీపాటికి గొప్ప సింగర్‌వి అయిపోయి ఉంటావని అనుకుంటుంటానెప్పుడూ. టీవీలో వచ్చే పాటల ప్రోగ్రామ్స్‌లో మా చందూ కనిపిస్తుందేమోనని ఎంతగా ఎదురుచూస్తానో తెలుసా" మంజూష అన్న మాటలు ఇంటికి వచ్చాక కూడా చందన మనసులో సుళ్లు తిరుగుతూనే ఉన్నాయి. నిజానికి మంజూష గుర్తుచేసే వరకూ తన ప్రత్యేకతలేమిటో మర్చిపోయింది తను. అవును మరి తన గురించి తను ఆలోచించుకునే దెపుడు? అనుక్షణం భర్తకి భయపడుతూ, అతనికి కోపం రాకుండా ఎలా నడుచుకోవాలో ఆలోచిస్తూ, తల్లి చెప్పిన సూక్తిముక్తావళి పాటిస్తూ రెండేళ్లుగా సంసార రథాన్ని లాక్కొచ్చింది. ఈ రెండేళ్ల కాలంలో తను పొందిందేమిటి? కోల్పోయిందేమిటి? ఆలోచిస్తున్న చందనకి ఏదో అవగతం కాసాగింది.

★ ★ ★

ఉదయాన్నే వంటింట్లోంచి వినిపిస్తున్న శ్రావ్యమైన గొంతు విని రాజేష్ ఆశ్చర్యపోయాడు. ఏనాడో మరచిపోయిందనుకున్న స్వరాలు చందన కంఠంలో శృతిచేసుకుంటున్నాయి. త్వరగా వంట ముగించి తనకిష్టమైన కనకాంబరం రంగు జరీ చీర కట్టుకుంది చందన. బారెడు వాలుజడలో నక్షత్రం లాటి తెల్ల గులాబి తురుముకుంది. బాపూ బొమ్మలా తయారై ఆఫీసుకి బయలుదేరబోతున్న చందన వంక అసహనంగా చూశాడు రాజేష్. ఆ చూపుకి అర్థం తెలుసు చందనకి. తను కాస్త మంచి చీర కట్టుకొని బైటకెడితే సహించలేడతడు. కోపమంతా కళ్లల్లోకి ప్రతిఫలిస్తుంటే తనని భస్మం చేసేలా చూస్తున్న రాజేష్ ఆమెనిపుడు భయపెట్టట్లేదు. ఆమెకిప్పుడు తన లక్ష్యం ఏమిటో తెలిసిందిగా మరి. తనకున్న టాలెంట్‌కి కృషిని జత చేసి ఆకాశమంత ఎత్తుకి ఎదగాలని ఆమె గుప్పెడంత గుండెలో ఒదిగిన కొండంత ఆశ. ఆ ఆశే ఆమెకి భర్తనెదిరించే ధైర్యాన్నిచ్చింది. ఆ ఆశ ఆమెకిపుడు ఊపిరిపోసింది. లక్ష్యం స్పష్టంగా ఉన్నప్పుడు ఏ మనిషీ దేనికీ భయపడడు.

☆